ఆదివారం

# ఆంధ్రజ్యోతి

6 నవంబర్ 2011



# సాహసం శాయరా డింభకా!

అన్వేషణ

**జొన్నగిరిలో వజ్రాలవేట**

కథ

**క్యాచ్ - 22**

# సాహసం శాయరా డింభకా!

★ టి.వి. కిరణ్మయి



కవర్ స్టోరీ

ఏడో తరగతి చదవడం పూర్తయితే పిల్లల కేరాఫ్ అడ్రస్ కోచింగ్ సెంటర్లే. పదోతరగతి పాసయ్యారో ఇక అంతేసంగతులు.. వాళ్లకు నచ్చింది ఏదీ వాళ్ల చేతుల్లో ఉండదు. తినడంతో మొదలుపెట్టి.. చదువుకోవడం వరకు అన్నీ టైంటేబుల్ ప్రకారం జరిగిపోవాలి. అది కాదని పిల్లలు కాసేపు ఇంట్లో ఖాళీగా కనిపించారో సమయం వృథా అయిందని ఫీలయ్యే తల్లిదండ్రులే ఎక్కువమంది. ఎమ్‌సెట్, ఈ-సెట్, ఇంకేదో సెట్ అంటూ వాటి ప్రిపరేషన్‌లోనే బాల్యాన్ని, బాల్యంలో ఆడాల్సిన ఆటల్ని.. వాటిలోని ఆనందాన్ని కోల్పోతున్నారు. ఆ తరువాత పై చదువులు, ఉద్యోగాలు.. అంతా బిజీబిజీ... ఈ బిజీ గజిబిజిలో వెనక్కి తిరిగి చూసుకుంటే వాళ్లకంటూ మిగిలింది ఏమీలేదనిపిస్తుంది. దాంతో అసంతృప్తి మొదలవుతుంది. నెమ్మదినెమ్మదిగా ఆ అసంతృప్తి తీవ్రత పెరిగి శారీరకంగా, మానసికంగా మనిషిని పీల్చి పిప్పిచేస్తుంది. ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి కాబోలు ఇప్పుడు ఎక్కువమంది తమ అభిరుచుల దుమ్ముదులిపి వాటి ఆసరాతో కొత్త(పాత) పనులు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. కళలు, సంగీతంతోపాటు ప్రకృతి ఒడిలో సేదదీరే అవకాశమున్న సాహసక్రీడల (అడ్వంచర్ స్పోర్ట్స్) వైపు కూడా ఎక్కువమందే మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఐటి ఇండస్ట్రీలో పనిచేసే ఉద్యోగులు వీటిపట్ల ఎక్కువ ఆసక్తి కనపరుస్తున్నారు. ఆ విశేషాలే ఈ వారం కవర్ స్టోరీ...

ఈ మధ్య ఎక్కువమంది యువత జిమ్‌లలో ఎక్సర్‌సైజ్‌లు చేస్తూ, పార్కుల్లో యోగాసనాలు వేస్తూ... శారీరకంగా, మానసికంగా 'ఫిట్'గా కనిపించేందుకు తాపత్రయపడుతున్నారు. అంతేకాదు సాహసక్రీడలకూ ఈ మధ్య ఎనలేని క్రేజ్ పెరిగింది. వీటిపట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్న వాళ్లలో ఎక్కువమంది ఐటి, కార్పొరేట్ కంపెనీల్లో పనిచేస్తున్నవారే. వారంలో ఐదు రోజులు ప్రాజెక్టులు, డెడ్‌లైన్లతో నలిగిపోయే వీళ్లు వారాంతాల్లో తెల్లవారుఝామునే నిద్రలేచి కొండలు, గుట్టలు పట్టుకు తిరుగుతున్నారు. ఇలా బయటకెళ్లినప్పుడు ఒక్క సాహసాలకే పరిమితం కాకుండా ప్రకృతి అందాలు కూడా ఆస్వాదిస్తున్నారు. సాహసాల్ని ఇష్టపడే వీళ్లందరూ 'గ్రేట్ హైదరాబాద్ అడ్వంచర్ క్లబ్' ద్వారా ఒకే గూటి కిందకు చేరారు.



కుటుంబ సభ్యులతో ట్రెక్కింగ్

## చుట్టూనే ఎన్నో...

కొండలు ఎక్కడం, దిగడం దగ్గర నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ఒరవడిలో పయనించడం వరకు రకరకాల సాహసక్రీడలు ఉన్నాయి. అయితే పక్క దేశాలతో పోలిస్తే మన దగ్గర వీటికి క్రేజ్ తక్కువే. సినిమాల్లో హీరోలు చేసినప్పుడు తెరమీద చూసి ఆహా అనుకోవడమే తప్ప వాటి గురించిన వివరాలు తెలుసుకోవాలన్న ఆసక్తి అంతగా కనిపించదు. ఆసక్తి అనేకంటే కూడా వాటిగురించి తెలుసుకునే అవకాశాలు లేవనొచ్చు. డిస్కవరీ, యానిమల్ ప్లానెట్ వంటి టివి చానళ్లలో వచ్చే సాహసాలను చూసి ఔరా! అని నోటిమీద వేలేసుకుంటారు కాని మన చుట్టూ సాహసక్రీడలకు పనికొచ్చే ఎన్నో ప్రదేశాలు ఉన్నాయనే విషయాన్ని గమనించరు.

జంటనగరాలనే తీసుకోండి. ఎటు చూసినా కొండలు, గుట్టలే కనిపిస్తాయి. గట్టిగా వెతకాలే కాని సాహస క్రీడలకు పనికొచ్చే బోలెడు ప్రదేశాలు దొరుకుతాయి. అదే పనిచేస్తున్నారు గ్రేట్ హైదరాబాద్ అడ్వంచర్ క్లబ్ సభ్యులు. జంటనగరాల్లోని మౌలాలి, అమ్ముగూడ, గన్‌రాక్, గండిపేటల నుంచి భువనగిరి, కీసరగుట్ట, నల్లమల, అనంతగిరి, నర్సాపూర్, పోచారం వరకు అన్నిట్నీ ఇప్పటికే ఎక్కి దిగేశారు ఈ క్లబ్ సభ్యులు.

సాహసక్రీడలు పెద్దపెద్ద కొండలు, గుట్టలు, నదుల ఆధారంగా జరుగుతాయి. రాక్ బోల్డరింగ్, రాక్ క్లయింబింగ్, ర్యాపెల్లింగ్, పారాగ్లయిడింగ్, రివర్ రాఫ్టింగ్, స్కూబా డైవింగ్, వాలీక్రాసింగ్ వంటివన్నీ ఈ కోవకే చెందుతాయి. అరకు, అనంతగిరి, శేషాచలం, శ్రీశైలం వగైరా ప్రదేశాలకు ట్రెక్కింగ్‌కు వెళ్లిన విషయాల్ని అప్పుడప్పుడు వింటుంటాం. ఈ క్లబ్ సభ్యులు కూడా అలాగే వెళ్తుంటారు అయితే ఒక్క ట్రెక్కింగ్‌తోనే వదిలిపెట్టకుండా పైన చెప్పిన సాహసాలన్నీ చేస్తుంటారు.

## మూడేళ్లలో వచ్చిన మార్పు



ఐ.టి. ఉద్యోగం చేస్తూ 'హైదరాబాద్ అడ్వంచర్స్' పేరుతో ఆన్‌లైన్ గ్రూప్ ఒకటి క్రియేట్ చేసి నేపాల్‌లోని అన్నపూర్ణ బేస్ క్యాంపుకు వెళ్దామని ఆహ్వానం పెట్టాను.. 2008 మే 27న. బోల్డంతమంది ట్రెక్కర్లు వస్తారనుకున్నాను. కాని ఒక్కరు కూడా స్పందించలేదు. దాంతో నేపాల్‌లో ఉంటున్న జగన్ అనే స్నేహితుడు తోడు రాగా ఒక్కడ్నే బయల్దేరి వెళ్లాను. క్యాంప్ ముగించుకుని వెనక్కి వచ్చిన తరువాత ఇంత నగరంలో ఒక్కరికి కూడా ఆసక్తి లేకపోవడం ఏమిటని ఆలోచించాను. మళ్లీ మే, 2009న రెండోసారి నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంపుకు బయల్దేరేందుకు సిద్ధమయ్యాను. ఈ క్యాంపులో పాల్గొనేందుకు ముగ్గురు ఔత్సాహికులు వచ్చారు. వాళ్లలో ఇద్దరు హైదరాబాదీలు కాగా మరొకరు బెంగళూరుకి చెందినవారు. తిరిగి వచ్చిన తరువాత హైదరాబాద్‌లోని కెబిఆర్ పార్క్‌లో ఫిట్‌నెస్ కార్యక్రమం మొదలుపెట్టాం. అప్పుడు ఒక మౌంటనీర్ స్నేహితుడు మాకో సలహా ఇచ్చాడు. ట్రెక్కింగ్ వంటివి చేయాలంటే ఈ ఫిట్‌నెస్ సరిపోదు. 'ఫైండ్ స్టెప్స్' అన్నాడు. ఆ సలహాతో హైదరాబాద్‌లో ట్రెక్కింగ్‌కి అవకాశం ఉన్న ప్రదేశాలను కనుగొని మూడు నెలలపాటు అక్కడ ప్రాక్టీసు చేశాం. రాళ్లతో నింపిన బరువైన బ్యాగులు వీపుకు కట్టుకుని ఎక్కడం, దిగడం ప్రాక్టీసు చేశాం. సోషల్ నెట్‌వర్క్ సైట్లను ఆశ్రయించి ఈవెంట్స్‌ను పోస్ట్ చేయడం మొదలుపెట్టాను. మంత్రం వేసినట్టు ఏడాదిన్నర తరువాత సభ్యుల సంఖ్య వేగవంతంగా పెరిగింది. ఇప్పుడు నెలకు కనీసం 350 మంది చేరుతున్నారు క్లబ్‌లో. ప్రస్తుతం సభ్యుల సంఖ్య 6800 కి చేరుకుంది.

**– దియానాత్ అలీ,**
గ్రేట్ హైదరాబాద్ అడ్వంచర్ క్లబ్ వ్యవస్థాపకులు











మరో కొండమీదికి... ఇలా!

## సాహసక్రీడల గురించి...

★ రాక్ క్లయింబింగ్‌లో కొండ చివరివరకు నెమ్మదిగా ఎక్కుతూ వెళ్తారు.

★ రాక్ బోల్డరింగ్ కూడా దాదాపుగా రాక్ క్లయింబింగ్ లాంటిదే. అయితే ఇం దులో తక్కువ ఎత్తు రాళ్లను ఎక్కుతారు. పొరపాటున పడిపోయినా దెబ్బలు తగలకుండా నేలపైన బోల్డరింగ్ మ్యాట్ ఉంటుంది.

★ రివర్ రాఫ్టింగ్.. అంటే ఉధృతంగా ప్రవహిస్తున్న నదిలో ఇన్‌ఫ్లేటబుల్ బోట్ వేసుకుని నీటి ఉధృతికి ఎదురీదుతారు. దీనికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఈత వచ్చి ఉంటే మేలు.

★ ర్యాపెల్లింగ్‌లో పెద్ద కొండ లేదా గుట్ట నుంచి తాడు సాయంతో కిందకి దిగుతారు.

హైదరాబాద్ అడ్వంచర్ క్లబ్‌లో వీటికే శిక్షణ ఇస్తున్నప్పటికీ మరెన్నో రకాల సాహసక్రీడలు ఉన్నాయి.

## కార్పొరేట్ అడ్వంచర్

ఈ క్రీడల్ని ఇష్టపడే వాళ్లే కాకుండా కార్పొరేట్ కార్యాలయాలు కూడా సాహస క్రీడల్ని ప్రోత్సహించడం మొదలుపెట్టాయి ఈ మధ్యకాలంలో. ప్రతి కంపెనీకి 'ఎంప్లాయి ఎంటర్‌టైన్‌మెంట్ బడ్జెట్' ఉంటుంది. ఆ బడ్జెట్‌తో ఉద్యోగుల్ని, కొన్నిసార్లు వాళ్ల కుటుంబసభ్యుల్ని కూడా రిసార్టులకు, హోటళ్లకు తీసుకెళ్లి ఆటవిడుపు కార్యక్రమాలను ఏర్పాటుచేస్తుంటాయి. ఇప్పుడదే బడ్జెట్‌ను సాహసక్రీడల వైపు మళ్లిస్తున్నాయి.

''సమయం, డబ్బు రెండూ సద్వినియోగం కావాలంటే అడ్వంచర్ స్పోర్ట్స్ బెస్ట్ అనుకుంటున్నాయి కార్పొరేట్ కంపెనీలు. ముఖ్యంగా ఐటి కంపెనీలు వీటివైపు మొగ్గు చూపడానికి సమయం, డబ్బే కాకుండా నాయకత్వ లక్షణాలు పెంచడం, టీంబిల్డింగ్, బాండింగ్ వంటివి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అవుట్‌డోర్ యాక్టివిటీలకు పెద్ద పీట వేస్తున్నారు. అమెరికాలో అయితే ఇందుకోసం ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తుంటారు. మన దగ్గర టిసిఎస్, డాక్టర్ రెడ్డీస్ వంటి కంపెనీలు తమ ఉద్యోగుల కోసం అడ్వంచర్ ఈవెంట్లను ఏర్పాటు చేయిస్తున్నారు. టిసిఎస్‌లో 350 మంది సభ్యులతో అడ్వంచర్ క్లబ్ ఒకటి ఏర్పాటు చేసుకున్నారు. అలాగే డాక్టర్ మర్రిచెన్నారెడ్డి ఇనిస్టిట్యూట్ వాళ్లు కూడా అడ్వంచర్ క్లబ్ ఏర్పాటు చేసుకున్నారు. మొదటిసారిగా సివిల్‌సర్వీసెస్ వాళ్లకోసం ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఐపిఎస్, ఐఎఎస్‌లు కాకుండా మిగతా సివిల్ సర్వీసెస్ విభాగాల వాళ్లు ఇందులో పాల్గొంటారు. మూడు నెలల పాటు ఉండే ఈ శిక్షణలో అడ్వంచర్స్ కూడా ఉంటాయి'' అని చెప్పారు గ్రేట్ హైదరాబాద్ అడ్వంచర్ క్లబ్‌లో సీనియర్ ఆర్గనైజర్‌గా, పిఆర్‌ఓగా పనిచేస్తున్న సురేష్. ఈయన జిహెచ్ఎసి తరపున కార్పొరేట్ అడ్వంచర్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటారు.

### రా'కింగ్



చిన్నప్పటి నుంచి అడ్వంచర్ స్పోర్ట్స్ అంటే ఇష్టం. ఎప్పుడైనా ట్రెక్కింగ్‌కి వెళ్తుండేవాడ్ని. ఐటి పరిశ్రమలో పనిచేస్తూ విభిన్నత కోసం వెతుకుతుంటే అడ్వంచర్ క్లబ్ దొరికింది. ఇందులో చేరి మూడేళ్లవుతోంది. నాకు అడ్వంచర్ స్పోర్ట్స్ అంటే ఎప్పుడూ ఇష్టమే. రాక్ క్లయింబింగ్ అంటే మరీ ఇష్టం. కాని హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చే వాళ్లు లేరు. హైదరాబాద్‌లో రాళ్లు ఎక్కువ. అందుకని ఇక్కడ అవగాహన కల్పించగలిగితే ఆదరణ బాగుంటుంది అనుకున్నాను. కానీ ప్రాక్టీసు చేయాలంటే నే కష్టం. క్లయింబింగ్ వాల్ 'లాటిట్యూడ్ జిమ్'లో, 'ప్రసాద్స్'లో ఉంది. ప్రసాద్స్‌లో ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఉంటుంది. నేను సీరియస్‌గా నేర్చుకోవాలని లాటిట్యూడ్‌కు వెళ్లాను. అక్కడ జపాన్ గ్రూప్‌తో పరిచయం అయ్యింది. వాళ్లలో 'టోనీ' అనే అతను పదిహేనేళ్ల నుంచి రాక్ క్లయింబింగ్ చేశారు. రాక్‌క్లయింబింగ్‌కి స్పెషల్ షూ ఉండాలి. ఆయన షూస్‌తో నేను ప్రాక్టీసు చేసేవాడ్ని. అడ్వంచర్ క్లబ్‌లో చేరిన తరువాత రాక్ క్లయింబింగ్ పట్ల ఆసక్తి కలవాళ్లు మరికొంతమంది దొరికారు. నేను ఈ క్లబ్‌లో సీనియర్ ఆర్గనైజర్‌గా మారాను. పర్‌ఫార్మెన్స్ బాగున్న వాళ్లని నేషనల్ మౌంటనీరింగ్ ఇనిస్టిట్యూట్‌కి ట్రైనింగ్‌కి పంపిస్తాం. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు బాగా క్లయింబింగ్ చేస్తారు. కాని వ్యక్తిగత కారణాల వల్ల వాళ్లు ఇందులో స్థిరంగా ఉండలేకపోతున్నారు. ఎందుకోగాని ఇందులోకి ఎక్కువగా డెసిషన్ మేకింగ్ పొజిషన్‌లో ఉన్న వాళ్లే వస్తుంటారు. ప్లానింగ్ అనేది చాలా ముఖ్యం. ఈ స్పోర్ట్ అంతరించిపోకుండా ఎందరో దీనివైపు వస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

**– రంగారావు,** రాక్ క్లయింబింగ్ ఎక్స్‌పర్ట్

ఇప్పుడు జిహెచ్ఎసి క్లబ్‌లో 6800 మందికి పైగా సభ్యులు ఉన్నారు. దీన్ని ఏర్పాటుచేసిన అసలు అడ్వంచరర్ దియానాత్ అలీ. ఈయన్ని మీ వయసెంత అని అడిగితే 'ఐ యామ్ ఆల్వేస్ 18' అంటారు. ఒక నవ్వు నవ్వి నమ్మశక్యం కానట్టు చూస్తే.. 18ను రెండుపెట్టి హెచ్చించండి అని ఒక చిరునవ్వు విసురుతారు. ''నాకు బాల్యం నుంచీ అడ్వంచర్స్ అంటే ఇష్టం. నాకున్న ఇష్టానికి చదువు, కెరీర్ బ్రేక్ ఇచ్చాయి. తరువాత కొంతకాలానికి అడ్వంచర్ స్పోర్ట్స్‌కి హైదరాబాద్‌లో మంచి స్కోప్ ఉన్నట్టు అనిపించింది. అందుకే ఆ దిశగా ప్రయత్నం మొదలుపెట్టాను'' అన్నారు దియా.





## అమ్మాయిలైతేనేం?

అడ్వంచర్ క్లబ్‌లో అమ్మాయిల సంఖ్య కూడా బాగానే ఉంది. ''చాలా కాలం నుంచి దియా నాకు స్నేహితుడు. అన్నపూర్ణ బేస్ క్యాంపు ట్రిప్‌కి వెళ్తున్నాడని తెలిసి అడిగాను. కాని అతను నన్ను వాళ్ల గ్రూపులో చేర్చుకునేందుకు ఒప్పుకోలేదు. ఫిట్‌నెస్ లేదన్నాడు. నాకేమో బాల్యం నుంచీ సాహసక్రీడలంటే ఇష్టం. ఎలాగైనా వెళ్లాలన్న పట్టుదలతో శిక్షణ

తీసుకున్నాను. ఈ క్లబ్ ప్రారంభం నుంచీ ఇందులో ఉన్నాను. మొదటిసారి మౌలాలి కొండ దగ్గర అడ్వంచర్ చేశాం. ఆ తరువాత ఎవరెస్ట్ బేస్ క్యాంపు (ఇబిసి)కి వెళ్లాను. చిన్న చిన్న సాహసాలతో మొదలుపెడితే... ఆ తరువాత ఎంత పెద్ద టాస్క్ అయినా ఇబ్బంది అనిపించదు. మౌలాలి, అమ్మగూడ, కీసరగుట్టలతో పాటు పుణే దగ్గరి ప్రాంతాల్లో కూడా ట్రెక్ చేశాను.

క్లబ్‌లో చేరాలనుకున్న చాలామంది అమ్మాయిలు నాకు ఫోన్ చేసి అమ్మాయిలకి ఇది సురక్షితమేనా అని అడుగుతారు. ఎందుకు కాదు? అనే ప్రశ్నే నా సమాధానం. అడ్వంచర్ చేసేటప్పుడు భయం లేకుండా చేస్తాం అన కూడదు. భయం ఉండాలి. ఎంతోకొంత భయం ఉన్నప్పుడే జాగ్రత్తగా చేయ గలుగుతాం. ఇలాంటివి చేయడం వల్ల ఆత్మవిశ్వాసం వస్తుంది. ఎటువంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కోగలం. జీవితానికి సరిపడా పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. అడ్వంచర్ స్పోర్ట్స్‌లో పారాగ్లయిడింగ్, స్కూబా డైవింగ్ కూడా చేయాలనేది నా లక్ష్యం.'' అన్నారు ఇన్ఫోటెక్‌లో కన్సల్టెంట్‌గా చేస్తున్న మొదటి ట్రెక్ లీడర్ ముప్ఫయ్యేళ్ల పద్మజ.

## అడవిలో నడవడం ఎంతో థ్రిల్లింగ్..



టీంబిల్డింగ్ కోసం ఐటి కంపెనీల్లో ఫన్‌డే కార్యక్రమాలు ఏర్పాటుచేస్తుంటారు. దానిలో భాగంగా అడ్వంచర్ క్లబ్‌ని సంప్రదిస్తే అనంతగిరి హిల్స్‌కి వెళ్తే బాగుంటుందన్నారు. మాతో వాళ్ల ఆర్గనైజర్లు ఇద్దరు వచ్చారు. మొదట 'డెక్కన్ ట్రయల్స్ రిసార్ట్'కి తీసుకెళ్లారు. అక్కడ వాల్ క్లయింబింగ్, రోప్ హ్యాంగింగ్ వంటివి చేయించారు. ఆ తరువాత అనంతగిరి అడవిలోకి ప్రయాణం. కారులోనో, బస్‌లోనో వెళ్లేటప్పుడు చూడడమే తప్ప మా బ్యాచ్‌లో ఎవరికీ అడవిలోకి కాలినడకన వెళ్లిన అనుభవం లేదు. మొదటి గంటసేపు చాలా చిక్కటి అడవి. మనసులో భయంగా అనిపించినప్పటికీ కొత్త అనుభవాన్ని ఎంజాయ్ చేశాం. అడవిలోకి వెళ్లే ముందే అడ్వంచర్ క్లబ్ సభ్యులు జాగ్రత్తలు చెప్పారు. పెద్ద సాలెపురుగులు, పాములు ఉంటాయని.. అవి ఎదురైతే భయపడకుండా, వాటికి హాని చేయకుండా బయటపడే విధానాల గురించి కూడా చెప్పారు. మాకు పాములు కనిపించలేదు కాని పెద్ద పెద్ద సాలెపురుగులు కనిపించాయి. ఇప్పటివరకు ఆ సైజు సాలెపురుగులను చూడనేలేదు. ఎక్స్‌పీరియెన్స్‌ను జీవితంలో మరిచిపోలేం. ఆ స్ఫూర్తితో జిహెచ్‌ఎసిలో సభ్యులుగా చేరదామనుకుంటున్నాం.

**– భరత్,** బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, గాలప్ టెక్నాలజీస్

## ఆహ్లాదాన్నిస్తుంది...

''ఈ ప్రోగ్రామ్ లేకపోతే సెలవురోజుల్లో పదయినా బెడ్‌మీద నుంచి లేవాలనిపించదు. క్లబ్‌లో చేరి కొద్దికాలమే అయినా కొత్త కొత్త ప్రదేశాలు తెలుస్తున్నాయి. నా ఫస్ట్ ట్రెక్ మౌలాలిలో చేశాను. రెండోది అమ్మగూడలో చేశాను. స్కూల్లో ఎన్‌సిసిలో ఉన్నప్పుడు నైనిటాల్ వెళ్లాం ట్రెక్కింగ్‌కి. దాని తరువాత మళ్లీ ఇప్పుడిలా చేయడం ఎంతో ఆహ్లాదాన్నిచ్చింది'' అంది జ్యోత్స్న అనే ఐటి ఉద్యోగి.

''ఈ క్లబ్‌లో చేరి ఏడాదిన్నర అవుతోంది. ఇక్కడకు వచ్చిన తరువాత చాలా నేర్చుకున్నాం. కొత్త కొత్త స్నేహితులవుతారు. వారంలో ఐదురోజులు డెస్క్ దగ్గర కూర్చుని పనిలో మునిగిపోయే వాళ్లకు అడ్వంచర్‌క్లబ్ మంచి వెంటిలేటర్. నేను, మా అన్నయ్య కూడా ఇందులో సభ్యులమే. మామూలుగా అయితే సెలవు రోజుల్లో



రాక్ క్లయింబింగ్ శిక్షణలో భాగంగా...

ఉదయాన్నే నిద్రలేవమంటే చిరాకు వస్తుంది. కాని అడ్వంచర్ క్లబ్‌లో చేరిన తరువాత బద్ధకం పరారైంది. ఏమాత్రం చిరాకు కూడా అనిపించడం లేదు. అన్నింటికంటే 'వుయ్ ఫీల్ వెరీ జాయ్‌ఫుల్'. ఈవెంట్లు ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసుకుంటాం. ఎవరూ ఈగోలకు పోరు'' అని చెప్పారు వెబ్ డెవలప్‌మెంట్ కంపెనీ యజమాని చందన్.

## ఐటి టు అడ్వంచర్..

ఆరేళ్ల నుంచి అరవై యేళ్ల వరకు ఎవరికైనా స్వాగతం అంటుంది ఈ క్లబ్. కాకపోతే ఆరు నుంచి పన్నెండేళ్ల లోపు పిల్లలకి తోడుగా తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు ఉండాలి. అలాగే పద్దెనిమిదేళ్ల లోపు వాళ్లయితే తల్లిదండ్రుల దగ్గరనుంచి అంగీకారపత్రం తీసుకురావాలి. పద్దెనిమిదేళ్ల తరువాత అయితే ఇండిపెండెంట్‌గా చేరిపోవచ్చు. వయసు ఎక్కువయ్యే కొద్దీ హెల్త్ ఫిట్‌నెస్ చూస్తారు. శరీరం సహకరించే వరకు ఈ క్లబ్‌లో చేరొచ్చు. ఇప్పటివరకు ఐటి హబ్‌గా పిలుస్తున్న హైదరాబాద్‌ని అడ్వంచర్ క్లబ్ హబ్‌గా చూడాలనేదే దియానాత్ ఆకాంక్ష. హైదరాబాద్ అంటే ఫుడ్, ముత్యాలు, గాజులు అంటూ మాట్లాడుకునే వాళ్లు ఇకనుంచి హైదరాబాద్‌ని 'అడ్వంచర్ ఎలాంగ్ విత్ బిర్యాని' అనాలని జిహెచ్‌ఎసి కోరిక. ఈ క్లబ్ మోటో 'గెట్ మోర్ అవుటాఫ్ లైఫ్'. అందుకని ఈ సారి ఏదైనా సందర్భంలో అడ్వంచర్‌కి దగ్గరగా వెళ్లాలనుకుంటే ఈ క్లబ్‌ను సంప్రదించవచ్చు. సాహసాలు ఒక్క హైదరాబాదీలకేనా అని మిగతా వాళ్లు బాధపడక్కర్లేదు. త్వరలో మహబూబ్‌నగర్, విజయవాడ, గుంటూరులకు కూడా క్లబ్ కార్యకలాపాలను విస్తరించాలనుకుంటున్నారు వీళ్లు. కావల్సిందల్లా ఉత్సాహవంతులైన యువతీ యువకులు. ముందుముందు ఈ క్లబ్‌ను దేశ వ్యాప్తంగా విస్తరించే ఆలోచనలు కూడా ఉన్నాయట.



